కథలాపూర్: భూషణరావుపేటలోని సహకార సంఘ కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి

కోరుట్ల: బహ్రెయిన్‌లో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సాగు నీరందక ఎండుతున్న పంటలు

- ఎస్సారెస్పీ డీ-36 ఉపకాలువకు నీటిని విడుదల చేయాలని రైతుల వేడుకోలు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 16: మెట్‌పల్లి మండలం చౌలమద్ది గ్రామ శివారులో భూగర్భ జలాలు అడుగంటి పంట పొలాలు నెర్రెలు బారుతున్నాయి. ఎస్సారెస్పీ డీ-36 ఉపకాలువ కింద చౌలమద్ది గ్రామానికి చెందిన 70-80 మంది రైతులు సుమారు 250 ఎకరాల్లో వరి వేశారు. ఓ వైపు ఎండలు ముదరడం, మరోవైపు ఎస్సారెస్పీ ఉప కాలువకు నీటిని వదలక పోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతో పంట పొలాలకు పూర్తిస్థాయిలో నీటి తడి అందక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. బోర్లు అడుగంటి, నెర్రెలు బారుతున్న పంట పొలాలను చూసి తల్లడిల్లిపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందించి ఎస్సారెస్పీ ఉప కాలువకు వెంటనే నీటిని విడుదల చేసి, తమ పంట పొలాలను కాపాడాలని అన్న దాతలు వేడుకుంటున్నారు.

నెర్రెలు బారిన తన పొలంలో దిగాలుగా నిల్చున్న రైతు పూదరి లచ్చన్న

మొక్కలు నాటి సంరక్షించాలి

- మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి
- ముందస్తుగా కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు

కథలాపూర్, ఫిబ్రవరి 16: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి కోరారు. గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకొని కథలాపూర్ మండలం భూషణరావుపేటలోని సహకార సంఘ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా లోక బాపురెడ్డి మాట్లాడుతూ, మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొండ ఆంజనేయులు, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శంకర్, గంగారెడ్డి, మహిపాల్‌రెడ్డి, కృష్ణ, రాజు, ప్రవీణ్, రాజు, వినోద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బహ్రెయిన్‌లో..

కోరుట్ల, ఫిబ్రవరి 16: బహ్రెయిన్‌లోని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ముందస్తు జన్మదిన వేడుకలను ఆదివారం ఎన్నారై బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. కేసీఆర్ నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని బహ్రెయిన్‌లోని శివాలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో ఎన్నారై బీఆర్ఎస్ సెల్ అధ్యక్షుడు రాధారపు సతీశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శులు మగ్గిడి రాజేందర్, అన్నారం సుమన్, కార్యదర్శులు చెన్నమనేని రాజేందర్, ఉత్కం కిరణ్ గౌడ్, చిలుకూరి రాజలింగం, తిప్పరవేణి శ్రీనివాస్, దేవదాస్, కొడారి రాజేందర్, వెంకటేశ్, చిన్న గంగారాం, రాము, తదితరులు పాల్గొన్నారు.

మొన్న తల్లి.. నేడు పిల్లలు

- పురుగుల మందు తాగిన ఘటనలో చికిత్స పొందుతూ ముగ్గురి మృతి
- పెగడపల్లి మండలం మద్దులపల్లి గ్రామంలో విషాదం

పెగడపల్లి, ఫిబ్రవరి 16: ఆ తల్లిని ఏ బాధ కలిచివేసిందో గానీ.. తను ఈ లోకంలో ఉండలేననుకున్నది. తాను లేని ఈ లోకంలో తన పిల్లలు కూడా ఉండలేరేమోనని భయపడింది కాబోలు. లాలించి.. బుజ్జగించి.. గోరుముద్దలు తినిపించిన ఆ తల్లే స్వయంగా బాధను దిగమింగుతూ.. తన పిల్లలకు పురుగుల మందు తాగించి.. తాను కూడా తాగింది. దీంతో రెండు రోజుల తేడాతో తల్లీబిడ్డలు మృతి చెందిన విషాదకర ఘటన పెగడపల్లి మండలం మద్దులపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దులపల్లి గ్రామానికి చెందిన కుంబాల హారిక(30) ఈనెల 13న రాత్రి తన కుమారుడు కృష్ణంత్(10), కూతురు మయాంతలక్ష్మి (8)కి పురుగుల మందు తాగించి.. తాను తాగి అపస్మారక స్థితికి చేరుకున్నది. గమనించిన భర్త తిరుపతి, బంధువులు వెంటనే కరీంనగర్‌లోని ఓ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడ నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లగా, హారిక చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందింది. శనివారం హారిక అంత్యక్రియలు జరుగగా, ఆదివారం వేకువ జామున దవాఖానలో చికిత్స పొందుతున్న చిన్నారులు కృష్ణంత్, మయాంతలక్ష్మి కూడా మృతి చెందడంతో బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఒకే కుటుంబంలో తల్లీబిడ్డలు పురుగుల మందుతాగి మృతి చెందడంతో గ్రామంలో విషాదం చోటుచేసుకున్నది. వ్యక్తిగత కారణాలతో తన చెల్లెలు హారిక మృతి చెందిందని ఆమె అన్న కుమార్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు.

కృష్ణంత్, మయాంతలక్ష్మి (ఫైల్)

తగ్గుతున్న పసుపు ధర

- ఆందోళనలో అన్నదాతలు
- సాంగ్లీ మార్కెట్‌తో పోల్చితే ధరలో భారీగా వ్యత్యాసం

మెట్‌పల్లి, ఫిబ్రవరి 16: కొద్ది రోజులు ఊరించిన పసుపు ధరలు మళ్లీ రోజు రోజుకూ తగ్గుముఖం పడుతున్నాయి. పసుపుపై పెట్టుకున్న ఆశలు అప్పుడే ఆవిరవుతుండడంతో పంట సాగు చేసిన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మెట్‌పల్లి, కోరుట్ల డివిజన్ల పరిధిలోని మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, కోరుట్ల, కథలాపూర్ మండలాల్లో పసుపు ఎక్కువగా పండిస్తారు. సాగు చేసిన పంట ఇప్పుడిప్పుడే దిగుబడి వస్తున్నది. బాయిల్డ్ చేసిన పసుపును అమ్మకం కోసం మార్కెట్‌కు తరలిస్తున్నారు. పసుపు మార్కెట్లలో నిజామాబాద్ తర్వాత రెండో పెద్ద మార్కెట్‌గా ప్రసిద్ధి చెందిన మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో గత నెల 31న పసుపు క్రయ, విక్రయాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పసుపు కాడి క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ. 12,666 పలుకగా, మోడల్ ధర రూ.11,511 ఉంది. గోళ గరిష్ఠ ధర రూ.10,666 పలుకగా, మోడల్ ధర రూ.10,666 ఉంది. అయితే ఈ ధరను చూసి రైతులు సంతోషపడ్డారు. కానీ ఆ ధర పైకి పోకపోగా రోజు రోజుకూ పడిపోతున్నది. ఈనెల 15న పసుపు కాడి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ. 10,811, మోడల్ ధర రూ.10,111 పలుకగా, గోళకు గరిష్ఠంగా రూ.9,511 పలుకగా, మోడల్ ధర రూ.7,611 పలికింది. పసుపు ధర ఎప్పుడు పెరుగుతుందో, ఎప్పుడో తగ్గుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. మార్కెట్‌లో ధర తగ్గుతుండడంతో పంట సాగుకు పెట్టిన పెట్టుబడి సైతం వస్తుందో, లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

భరోసా ఇవ్వని పసుపు బోర్డు

పసుపు బోర్డుతో పసుపుకు కనీస మద్దతు ధర వస్తుంది. ధరల స్థిరీకరణ ఏర్పడుతుందని రైతులు ఆశించారు. ఇటీవల పసుపు బోర్డు వచ్చింది, బోర్డు ఏర్పాటు, చైర్మన్ నియామకం చేపట్టారు. ఇక తమ కష్టాలు తీరినట్లేనని పంట సాగు చేసిన రైతులు భావించారు. కానీ, ప్రస్తుతం మార్కెట్‌లో పలుకుతున్న పసుపు ధర రైతుల ఆశలను నీరుగార్చినట్లే కనిపిస్తున్నాయి. మద్దతు ధర ఇవ్వలేదు, కనీసం పక్షం రోజుల కింద ఉన్న ధర కూడా స్థిరంగా లేకపోగా రోజు రోజుకూ పడిపోవడం రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నది.

సాంగ్లీ మార్కెట్‌తో పోల్చితే భారీగా వ్యత్యాసం

మహారాష్ట్రలోని సాంగ్లీ పసుపు మార్కెట్ ప్రసిద్ధి చెందింది. అక్కడ పసుపు కాడి క్వింటాల్‌కు రూ. 14 వేలు ఆపై ధర పలుకుతున్నది. సాంగ్లీ మార్కెట్‌కు మెట్‌పల్లి, నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్లలో పలికే ధరకు భారీగా వ్యత్యాసం ఉంటున్నది. మెట్‌పల్లి, నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్లలో పలికే ధరకు పెద్ద తేడా లేకపోగా, సాంగ్లీతో పోల్చితే మాత్రం రూ. 4 వేల నుంచి రూ. 5 వేలు వ్యత్యాసం ఉంటున్నది. మెట్‌పల్లి, నిజామాబాద్ మార్కెట్‌లో కొనుగోలు చేసిన పసుపును మెజార్టీ వ్యాపారులు సాంగ్లీ మార్కెట్‌కు తరలించి విక్రయిస్తుంటారు. ధరల వ్యత్యాసం పరిశీలిస్తే వ్యాపారులు సిండికేట్‌తో ధర పెరగకుండా ఈ రెండు మార్కెట్లలో మాయజాలం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. తమ పసుపు ఉత్పత్తులను సాంగ్లీ మార్కెట్‌కు తరలించే పరిస్థితిలో చాలా మంది రైతులు ఉండరు. అందుబాటులో ఉన్న మెట్‌పల్లికి లేదా నిజామాబాద్‌కు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు ధర పెరుగనివ్వడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో కొనసాగుతున్న పసుపు క్రయ, విక్రయాలు (ఫైల్)

పరామర్శ

కొడిమ్యాల(మల్యాల), ఫిబ్రవరి 16: మల్యాల మండలం రాజారాం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ ఎడిపల్లి అశోక్ తల్లి సత్తవ్వ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ఆది రెడ్డి, గోపీ, జగన్, శ్రీనివాస్, జలెందర్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడిమ్యాల(మల్యాల), ఫిబ్రవరి 16: మల్యాల మండలం పోతారం సబ్‌స్టేషన్‌లో సోమవారం మరమ్మతులు చేపడుతున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పోతారం, రాజారాం, తదితర గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కథలాపూర్, ఫిబ్రవరి 16: కథలాపూర్ మండలం తక్కళ్లపెల్లి గ్రామానికి చెందిన గడ్డమీది గంగు (72) చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగు శనివారం సాయంత్రం గ్యాస్ సిలిండర్‌పై చాయ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. తీవ్రగాయాలై అరవడంతో ఇంటి సమీపంలో ఉన్న వారు గమనించి చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. గంగు కుమారుడు గంగనర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు

సారంగాపూర్, ఫిబ్రవరి 16: మండలంలోని పెంబట్ల దుబ్బ రాజన్న ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు ఉత్సవాలకు జగిత్యాల నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడుపుతారని ఆలయ ఈవో అనూష ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో ఈనెల 23 నుంచి ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనుండగా, ఈనెల 25, 26, 27 తేదీల్లో భక్తుల ఎక్కువ సంఖ్యలో వస్తుండడంతో ఆర్టీసీ అధికారులు బస్సులు నడిపిస్తారని పేర్కొన్నారు. జగిత్యాల నుంచి వచ్చే ప్రత్యేక బస్సులు కోనాపూర్ స్టేజీ వరకు వస్తాయని, ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి

మల్లాపూర్, ఫిబ్రవరి 16: మల్లాపూర్ మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు బొడ్డు రాజేశ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు మెట్‌పల్లి పట్టణం నుంచి ఫైర్ ఇంజిన్ వచ్చే సరికి బాధితులు తీవ్రంగా ఆస్తి నష్టం పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు.

కులగణనకు మరో అవకాశం

జగిత్యాల, ఫిబ్రవరి 16: కుల గణన సర్వేలో వివిధ కారణాలతో వివరాలు నమోదు చేసుకోని వారి కోసం తెలంగాణ ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని కలెక్టర్ బీ సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్వే కోసం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ప్రత్యేక కాల్ సెంటర్ 040-21111111 ఏర్పాటు చేశారని, ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తుందని తెలిపారు. కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి ఆధార్, మొబైల్ నంబర్, అడ్రస్‌తో పాటు పోస్టల్ పిన్ కోడ్ నంబర్ తెలియజేయాలని సూచించారు.

చీటింగ్, ఫోర్జరీ కేసు నమోదు

మానకొండూర్, ఫిబ్రవరి 16: మానకొండూర్ మండల కేంద్రానికి చెందిన దస్తావేజుల లేఖరి ఆడప వినయ్, అతడి కుటుంబ సభ్యులు ఆడప వీరయ్య, ఆడప దివ్య, నరహరి వెంకటేశ్వర్‌పై ఆదివారం మానకొండూర్ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్, ఫోర్జరీ కేసు నమోదైనట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మానకొండూర్ గ్రామంలోని సర్వేనం 1157ఇలో పూర్వీకులకు చెందిన 24 గుంటల వ్యవసాయ భూమికి నకిలీ సాదాబైనామా పత్రాలు సృష్టించి, మోసపూరితంగా మ్యూటేషన్ చేయించడం, ఆ భూమిని కుటుంబ సభ్యులకు విక్రయదస్తావేజులు చేయడం వంటి అక్రమాలు వెలుగు చూశాయి. ఆడప కిష్టయ్య ఫిర్యాదు మేరకు వినయ్, అతడి కుటుంబ సభ్యులపై కేసు నమోదైనట్లు సీఐ తెలిపారు. ఈకేసులో ఇప్పటి వరకు ఆడప వినయ్, ఆడప వీరయ్య ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

'వృక్షార్చన' వాల్ పోస్టర్ ఆవిష్కరణ

గంగాధర, ఫిబ్రవరి 16 : ఈ నెల 17న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో మండలంలోని మధురానగర్ చౌరస్తాలో ఆదివారం 'వృక్షార్చన' వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యూత్ నాయకుడు పుట్కం రవీంద్రనాథ్ ఠాగూర్ మాట్లాడుతూ, కేసీఆర్ జన్మదినం సందర్భంగా రాజ్యసభ సభ్యుడు, గ్రీన్ ఇండియా చాలెంజ్ రూపకర్త జోగినపల్లి సంతోష్‌కుమార్ పిలుపు మేరకు యూత్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో మొక్కలు నాటి, వృక్షార్చన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అలరించిన వీడ్కోలు హంగామా

కోరుట్ల, ఫిబ్రవరి 16: పట్టణంలోని సాయి జీనియస్ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు ఆదివారం వీడ్కోలు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలు ప్రతిబింబించేలా విద్యార్థులు చేసిన జానపద నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చొక్కి రమేశ్, ప్రిన్సిపాల్ సుధ, జూనియర్ అసిస్టెంట్ మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆయకట్టుకు నీటి విడుదల

గొల్లపల్లి, ఫిబ్రవరి 16: రైతుల ఒత్తిడి మేరకు ఎట్టకేలకు రంగదాముని పల్లి రిజర్వాయర్ నుంచి డీ-83ఏ కెనాల్ ద్వారా ఆయకట్టుకు ఆదివారం అధికారులు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ గోవిందుల లావణ్య-జలపతి మాట్లాడుతూ, నీటిని సక్రమంగా విడుదల చేసి పంటలను కాపాడాలని అధికారులను కోరారు.

తల్లిదండ్రుల పోషణను విస్మరిస్తే చర్యలు

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 16: తల్లిదండ్రులను నిరాదరిస్తున్న కొడుకులు, కూతుళ్లు, కోడళ్లకు తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు కౌన్సిలింగ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం ఫిర్యాదుదారుల కుటుంబసభ్యులను పిలిపించి వయోవృద్ధుల చట్టంపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులను నిరాదరణకు గురిచేస్తే ట్రిబ్యునల్ అధికారి అయిన ఆర్డీవో ఆరు మాసాలకు పైగా జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు గౌరిశెట్టి విశ్వనాథం, వెల్మల ప్రకాశ్‌రావు, బైరి రాధ, కరుణ తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు

దుకాణాదారుడికి జరిమానా రసీదు ఇస్తున్న మున్సిపల్ అధికారులు

కోరుట్ల, ఫిబ్రవరి 16: నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగించే దుకాణాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి హెచ్చరించారు. పట్టణంలోని పలు కిరాణా దుకాణాలు, మటన్, చికెన్ విక్రయ దుకాణాల్లో ఆదివారం ఆయన మున్సిపల్ అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కవర్లను అధికారులు స్వాధీనం చేసుకొని, వ్యాపారులకు రూ. 15,500 జరిమానా విధించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, మున్సిపల్ సిబ్బంది జగదీశ్, గంగారాజు, రమేశ్, రాజేశ్, రాజ్‌కుమార్, తదితరులున్నారు.

ఆన్‌లైన్ గేమ్స్‌కు యువకుడు బలి

శంకరపట్నం, ఫిబ్రవరి 16: ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై లక్షల రూపాయలు పోగొట్టుకున్న ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ఈడిగ మధు (33) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. కొంత కాలంగా ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై దాదాపు రూ.2 లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ నెల 10న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మధు మృతి చెందాడు. అతడికి భార్య గీత, 10, 9 సంవత్సరాల వయసు గల ఇద్దరు కొడుకులు ఉన్నారు. భార్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా మధు ఆర్నెళ్ల క్రితం సైతం బావిలో దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు.

పేద విద్యార్థులకు చేయూత

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 16: కరీంనగర్ పద్మశాలీ సంఘం, సంక్షేమ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహంలోని నిరుపేద పద్మశాలీ విద్యార్థులకు ఆదివారం ఆ సంఘం అధ్యక్షుడు మెతుకు సత్యం ఉపకార వేతనాలు అందజేశారు. సంఘం జిల్లా కోశాధికారి భద్రయ్య, తదితరులున్నారు.

ట్రేడ్ లైసెన్స్ ఫీజు ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి

జగిత్యాల, ఫిబ్రవరి 16: మున్సిపల్‌కు ట్రేడ్ లైసెన్స్ ఫీజు మీ సేవ, ఆన్‌లైన్ ద్వారా చెల్లించి, రసీదు మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని ఇన్‌చార్జి కమిషనర్ చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. కొందరు ఫోన్ నంబర్ 63008 05117, ఇతర ఫోన్ నంబర్ల ద్వారా మున్సిపల్ కమిషనర్, సిబ్బంది పేరుతో సంబంధిత దుకాణం, యజమాని పేరు తెలియజేస్తూ యజమానులకు నేరుగా ఫోన్ చేసి ఫోన్ పే, గుగూల్ పే ద్వారా డబ్బులు చెల్లించాలని కోరుతున్నారని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు ట్రేడ్ లైసెన్స్ ఫీజు కేవలం మీసేవ/ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చెల్లించాలని కోరారు.

దమ్మన్నపేటలో ఉచిత వైద్య శిబిరం

మేడిపల్లి: దమ్మన్నపేటలో మాట్లాడుతున్న డాక్టర్ ఇంద్రనీల్

మేడిపల్లి, ఫిబ్రవరి 16: కోరుట్ల పట్టణంలోని మనోవరి దవాఖాన ఆధ్వర్యంలో ఆదివారం దమ్మన్నపేట గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు ఇంద్రనీల్, గీతాఇంద్రనీల్ సుమారు 200 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాచర్ల సురేశ్, మాజీ ఎంపీటీసీ ఏనుగు రమేశ్‌రెడ్డి, నాయకులు రాచర్ల హన్మాండ్లు, ఆర్ ఎంపీ, పీఎంపీలు బండ్ల మురళి, మొనుగూరి చక్రధర్, శ్రీరాముల రమేశ్, సిబ్బంది జనార్దన్, శశి, మణికంఠ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కట్లకుంటలో...

మేడిపల్లి, ఫిబ్రవరి 16: జగిత్యాల పట్టణంలోని సాయినాథ్ క్రిటికల్ కేర్ దవాఖాన ఆధ్వర్యంలో ఆదివారం కట్లకుంట బస్టాండ్ వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మహేంద్రనాథ్ సుమారు 200 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీలు గడ్డం జగదీశ్వర్‌రెడ్డి, రమేశ్, ప్రసాద్, మాజీద్, సంజీవ్, గంగాధర్, భీమరాజు, దవాఖాన నిర్వాహకుడు జవహర్‌లాల్ నాయక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ నుంచి వచ్చి.. పురుగుల మందు తాగి

- స్వగ్రామంలో మేడిపల్లి వాసి ఆత్మహత్య

రాములు (ఫైల్)

మేడిపల్లి, ఫిబ్రవరి 16: గల్ఫ్ నుంచి వచ్చిన ఓ వ్యక్తి ఇంటికి వెళ్లకుండా గ్రామ శివారులోని ఓ వ్యవసాయ పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మేడిపల్లి మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తునికి రాములు (42) ఇరవై సంవత్సరాలుగా గల్ఫ్ వెళ్లి వస్తున్నాడు. అప్పులు చేసి ఇంటి నిర్మాణం చేపట్టాడు. గత నవంబర్‌లో తిరిగి దుబాయ్‌కి వెళ్లాడు. అక్కడ వీసా రెన్యూవల్ కాకపోవడంతో పాటు అప్పులు పెరిగి పోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం స్వగ్రామానికి వచ్చాడు. ఇంటికి వెళ్లకుండా నేరుగా కస్తూర్బా వెనుక గల ఓ పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం కోసం జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. రాములుకు భార్య శ్యామల, ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రవీందర్‌రావు తెలిపారు.

ఊరూరా మొక్కలు నాటాలి

గంగాధర, ఫిబ్రవరి 16: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బర్త్‌డే సందర్భంగా ఈ నెల 17న చేపట్టిన వృక్షార్చన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఊరూరా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన బూరుగుపల్లిలో ముందస్తుగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సుంకె మాట్లాడుతూ 2014లో కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత పర్యావరణ పరిరక్షణకు హరిత హారం కార్యక్రమాన్ని ప్రారంభించి లక్షలాదిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ఆయన కృషితోనే తెలంగాణ ఇవ్వాళ పచ్చగా ఉందన్నారు. కేసీఆర్ హరిత హారం స్ఫూర్తితో అప్పటి రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ గ్రీన్ ఇండియా చాలెంజ్‌ను ప్రారంభించి దేశ వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, నాయకులు దూలం శంకర్‌గౌడ్, గడ్డం స్వామి, అన్నల్‌దాస్ తిరుపతి,లంక హరిబాబు పాల్గొన్నారు.

నరేందర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం

కొడిమ్యాల, ఫిబ్రవరి 16: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన పీఆర్వో రేకులపల్లి తిరుపతిరెడ్డి కోరారు. మండలంలోని అప్పారావుపేట, పూడూర్ గ్రామాల్లో ఆదివారం ఆయన పట్టభద్రులను కలిసి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మీఎన్ఆర్ టీం సభ్యులు శివ, మనోజ్, సతీశ్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

కథలాపూర్, ఫిబ్రవరి 16: కథలాపూర్ మండలం చింతకుంట గ్రామంలో శనివారం రాత్రి షార్ట్‌సర